# ధరణి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్ రెండు దగ్గర నిలబడి ఉన్నాను. రావలసిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఇంకా రాలేదు. టైమ్ ఏడు అవుతోంది... గంట లేటుట... ఎంక్వైరీ చేస్తే చెప్పారు.

ఢిల్లీ వెళ్లవలసిన ఎ.పి. ఎక్స్‌ప్రెస్ అరగంట ఆలస్యంగా బయల్దేరి వెళ్ళిపోయింది భీకరంగా శబ్దంచేస్తూ. ఎ.పి. ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళిన కొందరు ప్రయాణీకులు లేకపోవడంతో ప్లాట్‌ఫారమ్ కొంచెం ఖాళీగా అనిపించింది.

ఎర్ర చొక్కా వేసుకున్న కూలీలు హడావుడిగా తిరుగుతున్నారు కూలీకోసం. ట్రాలీల్లో సామాన్లు వేసుకున్న కొందరు ప్రయాణీకులు ఈస్ట్‌కోస్ట్ కోసం ప్లాట్‌ఫారమ్ మీద చేరుతున్నారు. మళ్ళీ హడావుడి... మామూలే!

విసుగ్గా వాచీకేసి చూశాను

ఏడుంబావు.

''బాబూ ధర్మం చేయండి... ఆరనా ఇయ్యండి బాబూ - బిడ్డకి ఆకలైత్తుంది'' పీలికలై వేళ్ళాడుతున్న చీరని అడ్డదిడ్డంగా కట్టుకున్న ఓ స్త్రీ చంకలో బిడ్డతో కనిపించి అడుగుతోంది. '' ఏం లేదు వెళ్ళమ్మా... ఎక్కడ నిల్చున్నా మీరు తయారు.'' విసుక్కున్నాడో పెద్దమనిషి.

''బాబూ!... బిడ్డకి పాలు లేవు బాబూ... నా దగ్గరగా వచ్చి దీనంగా అడిగింది.

చిరాకొచ్చింది... ''నీకే తిండి లేనప్పుడు ఈ బిడ్డనెందుకు కన్నావమ్మా'' వీలైనంత చిరాగ్గా అన్నాను.

ఆ పెద్దమనిషి నవ్వాడు... ''బాగా అడిగారు - తనకు దారిలేదు. మెడకో డోలని... తిండీ, నీళ్ళు దిక్కు లేకపోయినా బిడ్డల్ని కని... ఈ

దేశంలో ముష్టివాళ్ళ జనాభా మాత్రం బాగా పెంచుతారు.''

''అవునండీ... సినిమా హాళ్ళలో, రైల్వేస్టేషన్లలో, బస్స్టాపుల్లో, రోడ్లమీద... గుడి దగ్గర... ఇక్కడా అక్కడా అని లేదు... ఎక్కడ చూసినా వీళ్ళే.'' మరికొంత విసుగ్గా అన్నాడు ఇంకొకాయన...

''ఎక్కడన్నా సిగ్నల్స్ దగ్గర స్కూటర్ ఆపామనుకోండి... ఆ కొద్ది నిమిషాల్నే క్యాష్ చేసుకోటానికి ప్రయత్నం చేస్తారు... బండి కడ్డంపడి అడుక్కుంటుంటారు. వీళ్ళ బతుకులకి పిల్లలొకటి'' మరొకతను అన్నాడు.

''దానికేం ఉందిలెండి... మనదేశంలో అంతకన్నా ఏమీ చేయలేరు... పిల్లల్ని కనడం. వదిలేయడం... లేదా ఇలా జనాల మీద పడి అడుక్కు తినడం - ఏయ్ - వెళ్ళు - వెళ్ళమ్మా నీక్కాదు చెప్పేది --'' నాకాళ్ళకడ్డం పడుతున్న ఆ స్త్రీని గట్టిగా విదిలించాను.

''ఆరణా - బాబూ - బిడ్డకి పాలు బాబూ'' మా సంభాషణలోని అర్థాల్ని గమనించని... గమనించినా పట్టించుకోని ఆమె మళ్ళీ వేడుకుంది...

''బుద్ధుందా నీకు... ఓసారి లేదని చెప్తే వినాలి... వెళ్ళు ముందు ఇక్కడ్నించి...''

అందరం ఒక్కసారే అరిచాం.

బిత్తరపోయిన ఆమె ఉసూరుమంటూ ముందుకెళ్ళి పోయింది.

''డర్టీ బిచ్... ఆ పిల్లనిలా అడుక్కుతిని పెంచి, నాలుగేళ్ళు రాగానే దానిని పంపిస్తుంది ముష్టికి... వీళ్ళ వృత్తే అది... ఎందుకో అంత అవస్థపడి పిల్లల్ని పెంచకపోతే ఏం?- పీక పిసికిపారేయచ్చుగా'' అన్నాడు మొదటి పెద్దమనిషి...

మైక్‌లో ఎనౌన్సర్ కంఠం విన్పించింది...

మరో ఐదు నిమిషాల్లో గోదావరి ఎక్స్‌ప్రెస్ రాబోతోందని...

కూలీలు హడావుడిగా పరిగెత్తారు.

వెండర్స్... జోరుగా, హుషారుగా కేకలు పెడ్తూ పరిగెత్తారు.

వేడి వేడి ఇడ్లీలు, వడలు, న్యూస్‌పేపర్లు, మాగజైన్స్ చేతిలో పట్టుకొని ప్లాట్‌ఫారమ్ మీద తిరుగుతూ అమ్ముతున్నారు కొందరు కుర్రాళ్ళు.

ఒక కుర్రాణ్ణి పిలిచి న్యూస్ పేపర్ కొన్నా

ఎనౌన్సర్ కంఠం మళ్ళీ వినిపించింది.

''అబ్బ! ఈ కంఠస్వరం ఏమిటంత దారుణంగా''. విసుగ్గా అనుకున్నాను... ఇంకొంచెం స్వీట్ వాయిస్ సెలక్ట్ చేసుకోవచ్చు కదా! అనిపించింది.

''కృష్ణ... ఇంకో గంట లేటుట. ఈస్ట్‌కోస్ట్ కూడా లేటేనట-'' ఒక యువకుడు వచ్చి చెప్పాడు.

''మై గుడ్‌నెస్... ఇంకా గంటా? రైల్వేవాళ్ళు పంక్చువాలిటీలో ఇంత వెనకపడటానికి కారణం ఏమిటి?'' నిట్టూర్చాను...

ఒక్కటంటే ఒక్క రైలు నిర్ణీత సమయానికెందుకు రాదు? రైళ్ళ రాకపోకలను క్రమబద్ధం చేసే విషయంలో రైల్వే వాళ్ళు ఎందుకింత అశ్రద్ధ వహిస్తారో!... సామాన్య మానవుడికి సగం జీవితం రైల్వేస్టేషన్‌లో, సగం జీవితం బస్‌స్టాపుల్లో... బాగుంది... నవ్వుకున్నాను... గోదావరి ఎక్స్‌ప్రెస్ దడదడమని శబ్దం చేస్తూ వచ్చింది. చూస్తుండగానే జనాలతో నిండిపోయింది ప్లాట్‌ఫారమ్...

నేను ఓ పక్కగా పేపర్ చూస్తూ నిల్చున్నాను... వెయిటింగ్ రూమ్ ఖాళీగా లేదు... కూర్చోడానికి స్థలం లేదు. పేపర్‌లో నక్సలైట్ల హడావుడి. ఆత్మహత్యల స్టాటిస్టిక్స్... యాక్సిడెంట్ల జోరు... ఇవన్నీ చూసేటప్పటికి విసుగొచ్చింది.

''హలో!'' ఉలిక్కిపడి చూశాను...

నా ఎదురుగా ఓ స్త్రీ... ఎవరు? నేను 'హలో' అనే లోగానే చిరునవ్వుతో అందామే... 'గుర్తు పట్టలేదా?' వెంటనే గుర్తొచ్చింది నాకు.

ఆ స్వరం... ఆ చిరునవ్వు... ఎన్నేళ్లైనా, ఎన్నాళ్లైనా మర్చిపోలేనిది... ''ధరణి..''

''థాంక్స్! గుర్తు పట్టినందుకు...''

''మూడేళ్ళు కలిసి చదువుకున్నాం... గుర్తుపట్టకుండా ఎలా ఉంటాను?''

''కానీ విడిపోయి పదేళ్లైందిగా...''

''అయినా కొన్ని జ్ఞాపకాలు మర్చిపోనివ్వక ఎప్పటికీ అలాగే ఉంటాయి... ఇంతకీ మీరిక్కడ...'' సందేహంగా చూశాను.

''కొత్తగా మీరు అంటున్నావేంటి? హాయిగా మాట్లాడు. చాలాకాలం తరువాత కలుసుకున్నాం.'' ధరణి మాటల్లో, కంఠస్వరంలో ఏదో

అనిర్వచనీయమైన ఆనందం, ప్లెజెంట్‌నెస్ గోచరించింది. చాలాకాలం తరువాత ఆత్మీయుల్ని కలుసుకొన్న తృప్తి ఆమె కళ్ళల్లో కదలాడుతోంది...

ధరణి... ఒకనాటి అందాల భరణి -

కాలేజీ బ్యూటీగా, యువకుల గుండెల్లో ప్రేమ సుమాల మధుర సౌరభాలు పిరజిమ్ముతూ, వారి హృదయ విపంచి మీటి సరికొత్త రాగాలు పండించిన రాగవైశాఖి - అనురాగ వైశాఖి...

అప్పట్లో కాలేజీలో ధరణి కోసం తపించని వారు, ఆమె కటాక్ష వీక్షణాల కోసం తహతహలాడని వారు, లేరంటే అతిశయోక్తి కాదేమో! స్టూడెంట్స్ దగ్గర్నించి, లెక్చరర్స్‌దాకా ధరణిని ఆరాధించని వాళ్ళున్నారా! ఆమె అందుకోని ప్రేమలేఖ ఉందా?

అందర్నీ కాదని ప్రతివారిలో ఏదో ఓ లోపాన్ని వెదికి, నిర్దయగా తిరస్కరించి, ఎందరి హృదయాలనో గాయపరిచి,. ఓ అహంభావిగా, రాక్షసిగా గుర్తింపు పొంది... చివరికి గిరిధర్ అనే ఓ ఐ.పి.యస్ ఆఫీసర్‌ని పెళ్ళి చేసుకుంది.

అందర్నీ ఎదిరించి, అతణ్ణి ప్రేమించి పెళ్ళి చేసుకుంది. ఓ ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలిగిన ధరణికి నచ్చిన ఆ వ్యక్తి ఎంత గొప్పవాడై ఉంటాడో అనుకున్నారంతా.

పెళ్లైపోయిన నెలరోజుల్లోనే అతనితో వైజాగ్ వెళ్ళిపోయింది. ఆ తరవాత ఆమె గురించి వివరాలేం తెలీలేదు.

ఆమెను ఆరాధించిన వాళ్లల్లో నేనూ ఒకణ్ణి. ఐనా ప్రతివారిలో లోపాల్ని వెతికే ఆమె నైజాన్ని హర్షించలేకపోయాను. తనంత గొప్పదా! మనిషన్నాక ఏ బలహీనతలు లేనివాళ్ళెవరు? అనుకునేవాణ్ణి...

వీడుత్త శాడిస్ట్ శరత్... ఐడోంట్ లైక్ హిమ్. నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే. వెధవ వీడికి నన్ను ప్రేమించే అర్హత ఉందా?''

''మనిషన్నాక కనీసపు మానవతా విలువలు ఉండాలి... ఏమంటావు? శంకర్ బొత్తిగా నీతి, జాతిలేని మనిషి... వాళ్ళ నాన్న అక్రమంగా సంపాదించిన డబ్బు అనుభవిస్తూ పెద్ద పోజ్ కొడతాడు... ఐ హేట్ సచ్ ఫెలోస్.''

ఇలా ప్రతి వారిలో తప్పులు వెదికే ఆమె గుణం చూశాక నా ప్రేమ తెలియచేసే సాహసం చేయలేకపోయాను.

ఓసారి మా ఇద్దరికీ ఆప్తుడైన హరి అన్నాడు కూడా. ''ధరణిని నువ్వర్థం చేసుకోలేదు శరత్. తను చాలా మంచిది... మంచి మనసు, నీతి, నిజాయితీ, కరుణ, ఆదర్శాలు... ఇన్ని భావాలు కలబోసిన మంచి అమ్మాయి ధరణి... తనలాగే తనక్కాబోయే భర్త కూడా విలక్షణమైన వ్యక్తిత్వం కలిగి ఉండాలని కోరుకోవడంలో తప్పులేదుగా.''

''లేదు హరీ! తనకి చాలా గర్వం... అందగత్తెననీ, తనకోసం అందరూ పడిచస్తారని గర్వం... అందుకే అలా వెతికి, వెతికి లోపాలెంచుతుంది.'' అన్నాను.

''లేదు శరత్... యూ ఆర్ అబ్సొల్యూట్‌లీ రాంగ్!'' అన్నాడు హరి...

''హలో! ఏవిటి ఆలోచిస్తున్నావు?'' నా మొహానికి సమీపంగా చిటికెలు వేస్తూ అడిగింది ధరణి.

ఉలిక్కిపడ్డాను '' ఏమీలేదు ఓసారి ఫ్లాష్ బ్యాక్‌కి వెళ్లాను...''

ధరణి నవ్వింది. ఆ నవ్వులో ఏదో వెలితి... ఇదివరకటి చైతన్యం ఉత్సాహం... వెలుగు కనిపించలేదు.

ధరణిలో మార్పొచ్చింది. మనిషి కొంచెం లావైంది. నాగుపాములాంటి జడ స్థానంలో సన్నగా, పొట్టిగా ఉన్న కుచ్చులాంటి జడ వెలిసింది. సన్నటి నడుం సాగి వెడల్పైంది. కళ్ళకింద వలయాలు - తళతళలాడే చెక్కిళ్ళు వాడిపోయాయి. చెంపల దగ్గర... పాపిట్లో జుట్టు నెరిసింది.

వయసు తెచ్చిన హుందాతనం అనేకన్నా, అనుభవాలతో కలిగిన గాంభీర్యం ఆమెలో కనిపిస్తోంది.

''చాలా మారిపోయావు.'' అన్నాను

''సహజమేగా...?!''

''మీ వారెలా ఉన్నారు?''

నా ప్రశ్నకు జవాబు లేదు. ధరణి మాట్లాడలేదు... దూరంగా చూస్తూ నిల్చుంది.

ధరణి భర్త లంచగొండి అనీ విన్నాను... అతను రెండుసార్లు సస్పెండ్ కూడా అయినట్టు పేపర్లో చదివాను... ఎట్టి పరిస్థితుల్లోనూ తన అభిప్రాయాలను వదులుకోటానిక్కానీ, రాజీ పడటానిక్కానీ ఇష్టపడని ధరణి... అతనితో ఎలా కలసి జీవిస్తోందో అనుకున్నాం కూడా మేమంతా...

ఖచ్చితమైన అభిప్రాయాలున్న ధరణి, గిరిధర్ లాంటి అవకాశవాదినీ, వ్యసనపరుణ్ణీ ఎలా ప్రేమిస్తోందో అని వెటకారం చేశారు కూడా కొందరు...

''నువ్వేం చేస్తున్నావు?'' అడిగింది.

''బ్యాంక్ మేనేజర్ని... తెనాల్లో... ఈ మధ్యే ట్రాన్స్‌ఫర్ అయింది... ఫ్యామిలీని షిఫ్ట్ చేయలేదు. నేనే వస్తూ పోతూ ఉన్నాను... కృష్ణా ఎక్స్‌ప్రెస్ కోసం నా నిరీక్షణ... ఫలిస్తుందో! లేదో! అన్నాను...

నవ్వింది ధరణి -'' దాదాపు రెండు గంటల లేట్... ఎక్కడో యాక్సిడెంట్ అయిందిట... అందుకే అన్ని రైళ్ళు లేటే ఇవాళ... నేను రాజమండ్రి నుంచి వస్తున్నాను. మా పేరెంట్స్ అక్కడే ఉన్నారు. అన్నయ్య అక్కడ పేపర్‌మిల్స్‌లో పనిచేస్తున్నాడు... నిన్నిక్కడ చూసి షాక్ అయ్యాను... నువ్వు అవునా, కాదా అని ఆలోచిస్తూనే దగ్గరికొచ్చాను. నువ్వు కూడా చాలా మారావు.''

''అంటే... నువ్విక్కడే ఉంటున్నావా? వైజాగ్ నుంచి ఇక్కడికి వచ్చేశారా?''

''వైజాగ్ నుంచి తిరుపతి, అదిలాబాద్ - గుంటూరు... చాలా తిరిగాను... చివరికి హైదరాబాద్ చేరాను. బహుశా ఇదే ఆఖరి మజిలీ కావచ్చు.''

ధరణి మాటల్లో ఏదో శ్లేష...

నేను వాచీ చూసుకుంటూ అన్నాను...

''నేనెక్కవలసిన రైలు బహుశా జీవితకాలం లేటేమో!''

''ఈ మధ్య సాహిత్యం బాగా చదువుతున్నావా?''

''సాహిత్యం ఎప్పుడూ చదువుతాను... కాకపోతే జీర్ణం చేసుకోవడం ఈ మధ్యే ప్రారంభించాను.''

''ఐసీ... ఈ మాటల చమత్కారం కూడా ఆ ప్రభావమేనా?''

''అఫ్‌కోర్స్...'' నవ్వాను...

''రైలు లేటైనా ఫర్వాలేదు... చివరికి గమ్యాన్ని చేరిస్తే చాలు.''

''అదేం అలా అంటున్నావు... గమ్యం చేరక ఏమవుతాం? అవునులే... ఈ మధ్య రైలాక్సిడెంట్స్ కూడా జోరుగా ఉన్నాయి.''

''రైలు ప్రయాణం - జీవితంతో పోల్చిన మహానుభావుడు చాలా గొప్పవాడు శరత్... జీవితంలో కూడా రైలుకిలాగే ఎన్నో యాక్సిడెంట్స్...

గాయాలు బాధలు... మచ్చలు... మరణాలు...

''ధరణీ!... నువ్వేదో బాధ పడుతున్నావు - నీ బాధ పంచుకొనే అర్హత నాకుందనుకుంటే నాతో పంచుకోకూడదూ!''

''ఎదుటి వారి అర్హత గురించి నిర్ణయించే శక్తి నాకిక లేదు. ఆ రోజుల్లో అస్తమానం ఎదుటివాడి తప్పులెన్నుతూ, నా ఔన్నత్యాన్ని దిగజార్చుకున్నాను. నా వ్యక్తిత్వం ఉన్నతమైనదైతే నాకసలు ఎదుటి వారిలో తప్పులే కనపడేవి కాదుగా! అందర్నీ అర్థం చేసుకుని, అందర్నీ క్షమించి, ప్రేమించటమే చక్కటి వ్యక్తిత్వానికి గీటురాయి అన్న విషయం నాకప్పుడు అర్థమై ఉంటే, నా జీవన యాత్రలో నా వైవాహిక జీవితం మరో మలుపుగా మారి ఉండేది కాదు.''

''ఏం జరిగింది?''

''ఏముంది...? షరా మామూలే.'' నవ్వింది...

విషాదాన్ని హాలాహలంగా మింగుతూ, చిరునవ్వులనే అమృతపు ధారలు కురిపించగల శక్తి ఒక్క స్త్రీ జాతికే ఉందేమో!

''నాకు లంచగొండితనం, అవినీతి, అక్రమార్జనలంటే అసహ్యం అన్న సంగతి మీ అందరికీ తెలుసుకదూ! నా భర్త పోలీసాఫీసర్. నిరు పేద కుటుంబంలో పుట్టి కష్టపడి పైకొచ్చాడు. ఆయనకి సోషల్ స్టేటస్ మెయిన్‌టేన్ చేయడానికి ఫైనాన్షియల్ స్టేటస్ కావాల్సి వచ్చింది. ఆయన జీతం అవసరాలకి సరిపోయేది... కానీ లగ్జరీస్ కావాలి... ఎలా? నేనుద్యోగం చేస్తానంటే అవమానం - అందుకే అక్రమ మార్గం పట్టారు... అవి వద్దని బతిమాలాను దెబ్బలాడాను... ఫలితం శూన్యం. అటు ఫైనాన్షియల్‌గా, సోషల్‌గా ఎదిగిన ఆయనకి ఫ్రెండ్స్‌కేం కొదవ!... పెళ్ళికాకముందు అపురూపంగా తోచిన నా అందం, నాభావాలు ఆదర్శాలు ఆయనకి క్రమేణా అసహ్యంగా తోచాయి... ఇద్దరు పిల్లలు పుట్టినాక ఆయనలో మార్పు... భరించలేకపోయాను... ఇష్టంలేని వాటితో రాజీపడలేని నా తత్వం, విడిపొమ్మంది... విడిపోయాను... రెండేళ్లై ంది... ఆయన మళ్ళీ వివాహం చేసుకున్నారు.

''ధరణీ!'' ఆవేదనగా భారంగా పిలిచాను.

''మరి - నీ సంగతి - నువ్విలాగే ఉండిపోయావేం?''

''ఎంత అర్థం లేని ప్రశ్న శరత్! ఈ సంఘంలో నిజంగా వీరేశలింగం

గారు కోరిన మార్పు వచ్చిందనే భావిస్తున్నావా? మగవాళ్ళకి భార్యగా కన్నెపిల్లలు కావాలి... నాలాంటి వాళ్ళుకాదు. ఐనా నేనా విషయం ఆలోచించలేదు. ఆయన లాగా స్వార్థంతో మరో పెళ్ళి చేసుకుంటే నా పిల్లలు ఏం కావాలి? స్త్రీ స్వేచ్ఛకి పిల్లలు వారధులు... స్త్రీని నైతికంగా దిగజార్చకుండా ఆమె యవ్వన ప్రవాహానికి చెలియలికట్టలు.

తాను పొందిన విజ్ఞానంతో, తాను నేర్చుకున్న నాగరికతతో తాను అలవర్చుకున్న సంస్కారంతో తనలోని ఆశయాలు, ఆదర్శాలు, అభ్యుదయ భావాలు... వీటన్నిటితో భర్తని త్యజిస్తుంది... తనకి నచ్చకపోతే... కానీ పిల్లల్ని అంత తేలిగ్గా త్యజించలేదు స్త్రీ... కారణం ఆమె ఊహించుకునే ఆదర్శవంతమైన జీవితంలో ప్రధాన పాత్రలు పిల్లలే. ఎలాంటి స్త్రీ ఐనా... అసలీ సృష్టిలోని ప్రతి జీవి... ఏదోవిధంగా పిల్లల్ని పెంచటానికి కృషిచేస్తుంది... ఆరాట పడుతుంది... అలాంటిది... నాకు భర్త కోసం నేను పిల్లల్ని వదులుకోలేనుగా''

నేను అదిరిపోయాను... నిజమే కదూ! నాకెందుకో ఇందాకటి స్త్రీ గుర్తొచ్చింది. బిడ్డకోసమేనా ఆమె అంత దీనంగా ముష్టెత్తింది... మనసు కలుక్కుమంది.

''ధరణీ!... నువ్వు - నువ్వసలు ఎలా రాజీపడ్డావు!''

''నేను రాజీపడ్డానన్నది అర్థంలేని మాట... నేను రాజీ పడింది ఆయనతో కాదు. నా జీవితంతో... ఒక ఆదర్శ గృహిణిగానే కాదు... ఓ ఆదర్శ మాతృమూర్తిగా కూడా ఇది నా బాధ్యత... ఆధునిక మహిళ పిల్లల్ని నిర్లక్ష్యం చేసే స్థితికింకా దిగజారలేదు శరత్... అలా జరిగిన నాడు ఈ సమాజంలో ఈ కాస్త క్రమశిక్షణ, పటిష్టత కూడా ఉండదు. పురుషులంత బాధ్యతారహితంగా స్త్రీ కూడా ప్రవర్తిస్తే ఈ సమాజం ఏం కావాలి?''

''నీ పిల్లలకి తండ్రి ప్రేమానురాగాలు లభించకుండా చేశానన్న బాధ నీకు లేదా?''

''ప్రేమానురాగాలు.'' నవ్వింది.

''అవి నా దగ్గర నా పిల్లలకి పుష్కలంగా ఉన్నాయి. అంతేకాదు - ఆయన నిలకడలేని మనస్తత్వ ప్రభావం వాళ్ళమీద పడకుండా చేశాను. ఈ పిల్లల్ని నేను నా అభిరుచులకు అనుగుణంగా నా ఆదర్శాలకు మారు రూపాలుగా

పెంచుకుంటాను. ధరణి వ్యక్తిత్వానికి మరో రూపంలా పెంచుతాను. ధరణి లాంటి స్త్రీలు ఈ సమాజంలో చాలామంది ఉండి ఉంటారు. అలాంటి వారిలో కనీసం ఇద్దరికైె నా మంచి సహచరుల్ని నేనందిస్తాను. నాకున్నది ఇద్దరు మగపిల్లలు. నాకు సాధ్యమైనంత వరకు నేను వాళ్ళని ఉన్నతమైన సంస్కారం, మానవత్వం, ఉత్తమాభిరుచులతో తీర్చిదిద్దుతాను. నా పిల్లలే రేపటి సమసమాజ స్థాపనకు నాందీ పురుషులు కావాలి. అది నా బాధ్యత. నా బాధ్యత సక్రమంగా నిర్వహించేదాకా నేనో మహాయజ్ఞం ప్రారంభించాను. ఆ యజ్ఞంలో మరెవరికీ ప్రవేశం లేదు. భాగమూ లేదు. ఆ మహత్కార్యాన్ని నేను సాధించానన్న ఆత్మసంతృప్తి కోసం నేనా యజ్ఞాన్ని వంటరిగానే కొనసాగిస్తాను.''

''ధరణిని నువ్వర్థం చేసుకోలేదు శరత్!'' హరి మాటలు గుర్తొచ్చాయి.

''నిజమే! ధరణిని ఎవరర్థం చేసుకోగలరు! ఈమెని అర్థం చేసుకోవాలంటే ఎంతో సంస్కారం కావాలి... ఆ సంస్కారం నాకెక్కడిది?

మళ్లీ ఎనౌన్సర్ కంఠం విన్పించింది.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ పది నిమిషాల్లో రాబోతోంది.

నిట్టూరుస్తూ అన్నాను... ''నా ట్రైన్ వచ్చేస్తోంది. నేను వెళ్ళిపోతాను. మళ్ళీ ఎప్పుడు కన్పిస్తానో... ఎనీవే...ధరణీ! ఐ విష్ యూ ఆల్ ది బెస్ట్... ఐ విష్ యూ ఆల్ సక్సెస్... నేను అతి మామూలు మధ్యతరగతి మనిషిని! భార్య, ఇద్దరు పిల్లలు. నాకంటూ ఆదర్శాలేం లేవు... గాలి ఎటు వీస్తే అటు ఊగే చెట్టులాంటి వాణ్ణి. కాలంతో పాటు కదిలే ఋతువుల్లాంటి వాడ్ని. ఫలానా గమ్యం నాక్కావాలనే - ప్రత్యేకమైన ఆశలేం లేవు... కానీ... నువ్వలా కాదు... నీకో ప్రత్యేకమైన ఆశ ఉంది. నీకో లక్ష్యం ఉంది... ఈ జీవితంలోని ఏ ఒడిదుడుకు, ఏ ప్రలోభాలూ, ఏ వ్యామోహాలు నీ లక్ష్యాన్ని మార్చకూడదని... నువ్వు సుఖంగా నీ గమ్యాన్ని చేరాలని ఆశిస్తున్నాను.''

''థాంక్యూ శరత్ - థాంక్యూ సోమచ్.'' ధరణి కళ్ళల్లో అస్పష్టంగా కన్నీటి తెర.

రైలు దడ దడ శబ్దం చేస్తూ వచ్చింది.

నేను సూట్‌కేస్ తీసుకుని ధరణి వైపు చూశాను...

''హావ్ ఏ నైస్ జర్నీ.'' నవ్వుతూ చెబుతోంది.

మా ఇద్దరినీ డిస్టర్బ్ చేస్తూ వినిపించింది. ''అమ్మా... ధర్మం చేయి తల్లీ... బిడ్డ ఏడుస్తోంది తల్లి''

నా చేయి అప్రయత్నంగా జేబువైపు వెళ్ళింది. నేనీసారి ఆమెను విసుక్కోలేకపోయాను... నా కంటికి ఆమె యుష్టిదానిగా కాదు... మాతృమూర్తిగా కనిపించింది... చేతికందిన చిల్లర గుప్పిటతో తీసి ఆమె గిన్నెలో వేశాను...

ధరణి ఆశ్చర్యంగా చూస్తోంది... నేను తనకి చేయి ఊపి పరుగెత్తికెళ్ళి కంపార్ట్‌మెంట్ చేరాను...

ధరణి దగ్గరగా వచ్చింది... నేను సీటు వెతుక్కుని కూర్చున్నాను... కిటికీ దగ్గరగా వచ్చి చేయి ఊపింది... రైలు దడదడమని శబ్దం చేస్తూ, భీకరంగా అరుస్తూ బయలుదేరింది.

ధరణి చిరునవ్వుతో చేయి ఊపుతోంది.

నాకేదో చెప్పాలని ఉంది... ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థం కాలేదు... రైలు మెల్లిమెల్లిగా కదిలి... వేగాన్ని పుంజుకుంది. ప్లాట్‌ఫారం, ప్రయాణికులు, బుక్‌స్టాల్స్ అన్నీ కనుమరుగై పోతున్నాయి. చెట్లూ, చేమలూ, కొండలూ, గుట్టలూ సాక్షాత్కరిస్తున్నాయి. కానీ ధరణి మాత్రం కనుమరుగవలేదు.

విశ్వవ్యాప్తమై కనిపిస్తూనే ఉంది.

రైలు చేస్తోన్న శబ్దం భయంకరంగా వినిపిస్తోంది.

ధరణి... అంటే భూమి.

భూమిని దేవిగా మార్చి, భూదేవిగా స్తుతిస్తారు. సహనానికి మారు పేరు భూదేవి అంటారు. నిజమే! తన గుండెలని కోస్తూ, నిర్దయగా సాగిపోతోన్న రైలును క్షమిస్తోంది భూదేవి. కసాయి కత్తులు కురిపించే రుధిర ధారల్ని భరిస్తోంది భూదేవి.

తనపైన దాడి జరిపి, గుండెల్లో గునపాలు గుచ్చి, పునాదులు వేసినా భరిస్తోంది.

ఆ పునాదుల మీద నిర్మిస్తోన్న కాంక్రీటు భవంతుల భారాన్ని సహిస్తోంది....

ఎందుకు? తన సంతానం అయిన ఈ జనావళి జీవనం కోసం. అందుకే ఆమె సహనానికి మారు పేరైంది.

స్త్రీ కూడా అంతే.

తన బిడ్డల కోసం ఎన్నో చిత్రహింసల్ని, అవమానాలను భరిస్తుంది... సహిస్తుంది... ఎన్నో అందాలనూ, సుఖాలనూ త్యాగం చేస్తుంది. ఒక గడ్డిమొక్క మొలిపించటానికి పుడమి తల్లి ఎంత ప్రసవ వేదన పడిందో! అని తల్లిడిల్లింది లత భావ హృదయం.

అంత ప్రసవ వేదన పడినందుకేనా అంత మమకారం స్త్రీకి తన సంతానం మీద!

స్త్రీ హృదయం చదవ శక్యంకాని మహాకావ్యం.

సామాన్యులకి అర్థంకాని ఒక ఉద్గ్రంథం.

ఆమె హృదయం ఓ మహా సముద్రం -

ఆమె అంతరంగం విశాల విశ్వం...

ఈ విశాల విశ్వం నిండా వ్యాపించిన ఈ ధరణి వైశాల్యం కొలిచే సాధనం ఉందా?

ఏ సాధనం లేకుండా ధరణి లాంటి స్త్రీ హృదయ వైశాల్యాన్ని కొలవాలనుకోవడం ఎంత అవివేకం!?

ఈనాడు ఆదివారం అనుబంధం